క్లుప్తంగా

అలరించిన కవితాగానం



కవితాగానం చేస్తున్న పెండ్యాల సుజాత

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఫిబ్రవరి రెండో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కవులు వివిధ ప్రక్రియల్లో తమ కవితాగానం చేశారు. సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు మలయశ్రీ, పెంచాల శ్రీనివాస్, జగన్‌మోహన్‌రావు, సుజాత, ప్రమీల, విద్యాసాగర్ హాజరయ్యారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చెన్నూర్: మండలంలోని కత్తెరశాల, అంగ్రాజుపల్లి గ్రామాల మధ్య శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కంకణాల దేవేందర్‌రెడ్డి(40), చెన్నూర్ పట్టణంలోని లైన్‌గడ్డకు చెందిన సైఫ్ అనే యువకుడు మృతి చెందారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి పార్థివ దేహాలను సందర్శించి పూల మాలలు సమర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి వెంట మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్, కాంగ్రెస్ నాయకులు బాపగౌడ్, మహేశ్‌తివారి, కుర్మ రాజమల్లగౌడ్, సుశీల్‌కుమార్, చెన్నూరి శ్రీధర్, చింతల శ్రీనివాస్ ఉన్నారు.

సంతాప సభ



నివాళులర్పిస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు కోడి రాములు ఈ నెల 17న రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో జిల్లా కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మంతెన మల్లన్న, జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

భీమారంలో అకాల వర్షం



పూత రాలిన మామిడి చెట్టు

భీమారం: మండలంలో శనివారం రాత్రి అకాల వర్షం కురవడంతో మామిడి తోట లకు నష్టం వాటిల్లింది. వరి పంటకు లాభం చేకూరినప్పటికీ, మామిడి తోట ల్లోని చెట్లు పూతదశ నుంచి పిందెలకు మారుతున్న క్రమంలో గాలులతో కూడిన వర్షం పడడంతో పూత, పిందెలు నేలమట్టం అయ్యాయని రైతులు వాపోతున్నారు.

భారీ వాహనాల నిషేధాన్ని ఎత్తివేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: టైగర్‌జోన్ పేరున జన్నారం నుంచి భారీ వాహనాల రాకపోకలను నిషేధించారని, దీంతో జన్నారం మండల మార్కెట్ పడిపోయిందని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భారీ వాహనాల రాకపోకల నిషేధాన్ని ఎత్తివేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు జన్నారం మండలానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జన్నారం మండలానికి చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ.. భారీ వాహనాల నిషేధం వల్ల వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. చెక్‌పోస్టుల వద్ద అధికారులు పర్యావరణ సెస్ పన్ను వసూలు చేయడం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి మహేశ్, పరశురాం, అక్బర్, వెంకటేశ్వర్‌రావు, రాజేశ్‌నాయక్, చంద్రశేఖర్ నాయకులు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు బంద్..!

- సీసీఐలో పది రోజులుగా నిలిపివేసిన అధికారులు
- రైతుల వద్ద పేరుకుపోయిన పత్తి నిల్వలు
- దళారులను ఆశ్రయించి నష్టపోతున్న వైనం



భీమారం గ్రామంలో రైతు నాగరాజు ఇంట్లో నిలువ ఉన్న పత్తి

చెన్నూర్: అమ్ముతామంటే అడవి, కొందామంటే కొరివిగా మారింది పత్తి రైతుల పరిస్థితి. రైతులు దళారులను ఆశ్రయించి దగా కాకుండా ఉండడంతో పాటు గిట్టుబాట ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టింది. రైతుల వద్ద ఉన్న పత్తి పూర్తిగా అయిపోయే వరకు పత్తి కొనుగోళ్లు చేపట్టాల్సిన సీసీఐ అధికారులు మధ్యలో పత్తి కొనుగోళ్లు బంద్ పెట్టారు. జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి నిల్వలు పేరుకుపోయాయని ఈ నెల 15న పత్తి కొనుగోళ్లు నిలిపివేసిన సీసీఐ అధికారులు నేటికీ ప్రారంభించలేదు. సీసీఐ అధికారులు ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కై పత్తి కొనుగోళ్లు నిలిపివేశారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సీసీఐ అధికారులే పత్తి కొనుగోళ్లు బంద్ చేయడంతో చేసేది లేక దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల వద్ద 30శాతంకు పైగా పత్తి..

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాలలో 30శాతంకు పై పత్తి ఉందని రైతులు పేర్కొంటున్నారు. చెన్నూర్ మార్కెట్ పరిధిలో సీసీఐ ద్వారా కొనుగోళ్ల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడంతో రైతులు పత్తిని ఇళ్లలోనే నిలువ ఉంచుకున్నారని పలువురు రైతులు అంటున్నారు. సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన రోజుల్లో వందలాది వాహనాలు మార్కెట్ కార్యాలయం వద్ద పడిగాపులు కాచి వాహనాల వేయిటింగ్ చార్జీలు భరించలేక ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా తేమశాతం పేరుతో లేనిపోని కొర్రిలు పెట్టడంతో రైతులు దళారులకు పత్తిని విక్రయించుకోవాల్సి వచ్చిందని పలువురు రైతులు మధు, సమ్మయ్య పేర్కొన్నారు.

ప్రైవేట్‌లో పెరుగుతున్న పత్తి ధరలు..

ప్రస్తుతం ప్రైవేట్‌లో క్వింటాళ్‌కు ధర రూ.6850 నుంచి రూ.6900 పలుకుతుంది. తొలుత సీసీఐ మద్దతు ధర క్వింటాళ్‌కు రూ.7020 ఉండగా పక్షం రోజుల క్రితం వంద రూపాయలు పడిపోయింది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాళ్ పత్తి రూ.6300 నుంచి రూ.6400 కొనుగోలు చేశారు. రెండు రోజుల నుంచి ప్రైవేట్‌లో పత్తి ధరలు పెరిగాయని రైతులు అంటున్నారు. రానున్న రోజుల్లో ప్రైవేట్‌లో పత్తి ధరలు మరింత పెరిగితే సీసీఐ ప్రారంభించినా లాభం లేకుండా పోతుందని వాపోతున్నారు.

సీసీఐ సక్రమంగా కొనుగోలు చేయలే..

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించలేదు. టోకెన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేశారు. రైతులను వాహనాల వేయిటింగ్ చార్జీ తడిసిమోపడైంది. తేమ పేరుతో లేనిపోని కొర్రిలు పెట్టడంతో తొలుత ప్రైవేట్‌ను ఆశ్రయించి తక్కువ ధరకు పత్తిని అమ్ముకోవాల్సి వచ్చింది. తక్కువ ధరకు పత్తి అమ్ముకున్న తర్వాత ప్రైవేట్‌లో ధర పెరిగింది. అప్పులు చేసి సాగు చేసిన రైతులకు ఏదో విధంగా ప్రతి ఏటా నష్టమే జరుగుతుంది.

- మానిశెట్టి శ్రీనివాస్, రైతు, చెన్నూర్

'పీఎస్ఆర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి'



మాట్లాడుతున్న శంకర్‌రావు

నస్పూర్: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచి కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. ప్రేంసాగర్‌రావు కార్మికుల హక్కుల సాధనకై నిరంతరం పోరాడుతున్నారని కార్మికుల, కార్మిక నివాస ప్రాంతాల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం అభినందనీయం అని అన్నారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికులకు సొంత ఇంటి కలను ప్రభుత్వ సహకారంతో నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గరిగ స్వామి, శ్యాం, ఎస్ఆర్‌పీ 3 పిట్ సెక్రటరీ పెట్టం శ్రీనివాస్, పీ.తిరుపతి రాజు, వెంకటస్వామి, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై హర్షం



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: గత ప్రభుత్వం 317జీవో ద్వారా ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలపై అధ్యయనం చేసి, పరిష్కారాలను సిఫార్సు చేయడం కోసం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా టీఎన్జీవోస్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 317జీవోతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, క్యాడర్‌లో జూనియర్ అయినందుకు సొంత జిల్లాను వదిలి ఇతర జిల్లాలకు కేటాయించబడ్డారన్నారు. ఈ సమస్యపై ఉద్యోగులు చేసిన పోరాటానికి ప్రస్తుత ప్రభుత్వం చర్యలను తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు, కోశాధికారి సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సారంగపల్లి కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీని పార్టీ మండల అధ్యక్షుడు నీలయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాచకొండ కమల మనోహర్‌రావు, అధ్యక్షుడిగా ఎండీ అబ్బు, ఉపాధ్యక్షులుగా పెద్దపల్లి చంద్రకళ, యాదగిరి మల్లేష్, అంబిలపు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎగుడ రాయమల్లు, సహాయ కార్యదర్శిగా జంగపల్లి లక్ష్మి, సహ సహాయ కార్యదర్శిగా ఎండీ తాజొద్దీన్, కార్యదర్శిగా అరికోళ్ల రమేష్, కోశాధికారిగా పెద్దపల్లి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా ఎండీ మొఖీద్, రేషవేణ లింగయ్య, ఆవుల కుమార్, రామగిరి కుమార్ సలహాదారుగా ఆసంపల్లి రాజయ్యను ఎన్నుకున్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి మైదానంలో ఆదివారం ఐపీఎల్ తరహాలో కాసిపేట మండల క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఐపీఎల్ మాదిరి క్రీడాకారులను ప్రాంచేంజీలు వేలంలో కొనుగోలు చేసి పోటీలు నిర్వహించారు. పది ప్రాంచేంజీలు పది జట్లతో పోటీలు నిర్వహించగా 26రోజుల పాటు పోటీలు కొనసాగనున్నాయి. మొదటి బహుమతి రూ.యాభైవేలు, రెండో బహుమతి రూ.ముప్పై వేలుగా ప్రకటించారు. పోటీలను ప్రారంభించిన అతిథులు ఐపీఎల్ తరహాలో ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గోంది రమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నజీర్, రవిరాజ్, రమేష్, నిర్వాహకులు దాసరి శంకర్, రాజు, కముటం తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



చెక్కు అందిస్తున్న స్నేహితులు

నస్పూర్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాంపల్లి వేణు కుటుంబ సభ్యులకు చిన్ననాటి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. పట్టణ పరిధిలోని సంఘం మల్లయ్యపల్లెకు చెందిన వేణు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయనతో శారధా శిశు మందిర్‌లో చదువుకున్న 2000–2001 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు రూ.58వేలు పోగు చేసి మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు రఫీఖ్ ఖాన్, తాజోద్దీన్, కళ్యాణం రవి, విజయ్, సురేందర్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో కుటుంబం..

- భర్తకు రక్తం వాంతులు – భార్యకు థైరాయిడ్
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న దంపతులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజారాం

జన్నారం: మాదిగ రిజర్వేషన్ కోసం పోరాటం చేశాడు. మందకృష్ణ వెంట తిరిగాడు. అనేక కార్యక్రమాలు చేపట్టాడు. అనారోగ్యం భారిన పడి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. తనకు ఊపిరితిత్తుల్లో ఇబ్బంది ఏర్పడి రక్త వాంతులు చేసుకుంటూ ఆసుపత్రిలో చేరగా, తన భార్య థైరాయిడ్ భారినపడి ఆసుపత్రి పాలయింది. ఇద్దరికి ఆసుపత్రిలో చికిత్సకు డబ్బులు లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన పూర్ణపు రాజారాం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా, కులవివక్ష పోరాట సమితి నాయకుడిగా, ఆర్ఎంపీ వైద్యుడిగా పలు సేవలందించారు. అతడికి భార్య కళావతి, ఇద్దరు కుమారులున్నారు. కాగా వారిలో ఒకరు ఆరో తరగతి, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. గతేడాది క్రితం రాజారాం మధుమేహం భారిన పడ్డాడు. అప్పటి నుంచి ఎమ్మార్పీఎస్‌లో సేవలు తగ్గించాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఊపిరితిత్తుల్లో ఇబ్బంది(ఇన్‌ఫెక్షన్) ఏర్పడి రక్తం వాంతులు చేసుకున్నాడు. చేతిలో చిల్లిగవ్వలేని రాజారాం కుటుంబీకుల సాయంతో మహారాష్ట్రలోని మిషనరీ ఆసుపత్రిలో చేరాడు. అక్కడ కొన్ని రోజులు చికిత్స అనంతరం తిరిగి ఇంటికి వచ్చాడు. తర్వాత భార్యకు అనారోగ్య సమస్యలు ఏర్పడటంతో ఆమెను అప్పోసప్పో చేసి ఆసుపత్రిలో చేర్పించారు. అయితే నెల రోజుల క్రితం తిరిగి రక్తం వాంతులు చేసుకున్నాడు. వెంటనే ఆయన్ను మహారాష్ట్రలోని మిషనరీ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ నెల రోజులుగా చికిత్స పొందుతున్నాడు. అయితే ఆసుపత్రిలో చార్జీలు తక్కువగా తీసుకుంటున్నందునా ఇప్పటివరకు రూ.2లక్షలు ఖర్చు అయ్యాయి. మరో రూ.2లక్షలు వైద్య ఖర్చులకు అవసరం ఉన్నాయి.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు..

పూర్ణపురాజరావు ఆస్తి పాస్తులు లేవు. రోజు భార్య కూలీ పని చేయడం, రాజరావు ఆర్ఎంపీ పనిచేయడం వల్ల వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ జరిగేది. ఈ క్రమంలో భార్యభర్తలు ఇద్దరు అనారోగ్యం భారిన పడటం, ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందడం వల్ల వైద్య ఖర్చులకు ఇబ్బందికరంగా మారింది. కనీసం సొంత ఖర్చులకు కూడా డబ్బులు లేని స్థితిలో ఉన్నట్లు కుటుంబీకులు తెలుపుతున్నారు. ఈ సమయంలో దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు సహకరించి ఆదుకోవాలని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఆసుపత్రిలోనే ఓ మూలన బెడ్ ఇచ్చినట్లు చెబుతున్నాడు. దయగల మహారాజులు స్పందించి రాజరావు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

దాతలు సహకరించాల్సిన నం:
ఫోన్ పే: 70324 57229

ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చండి



మాట్లాడుతున్న తపస్ నాయకులు

చెన్నూర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టి పోయిందన్నారు. కులానికి ఒక్క గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి సొంత భవనాలు నిర్మించలేదని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికో ఇంటర్నేషనల్ పాఠశాల నిర్మాణం కోసం రూ.2500కోట్ల కేటాయించిందన్నారు. మండలానికి కాకుండా జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలను నిర్మించి మిగులు బడ్జెట్‌తో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో తపస్ జిల్లా కార్యదర్శి కొట్టె నాగరాజు, నాయకులు దుర్గం చందు, అట్టెం రవి, సంతోశ్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో వేగం పెంచండి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్ల వేగాన్ని వెంటనే పెంచి గడువులోగా లక్ష్యం చేరాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జిల్లాలోని 16మండలాల్లో గల గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, నల్లా పన్నుల డిమాండ్, ఇతర పన్ను బకాయిలు వెంటనే వసూళ్లు చేసే లా ప్రత్యేక కార్యచరణతో ముందుకు సా గాలని తెలిపారు. పన్నుల వసూళ్లు సాగుతున్నా వేగవంతం చేయాలని, ఇందుకు అనుగుణంగా వెంటనే సిబ్బందితో పన్ను ల వసూళ్లు వేగవంతం చేసి గడువులోగా పన్నులు పూర్తిగా వసూళ్లు చేసి వసూళ్లలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ



మారథాన్ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు, ప్రజలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ యెగ్గన చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ యెగ్గన సారథ్యంలో ఆదివారం అవయవదానంపై అవగాహన కోసం ఐబీ చౌరస్తా నుంచి ఎయిమ్స్ ఆసుపత్రి వరకు మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎయిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న మొదటి 50మందికి మెడల్స్‌ను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



భక్తుల ధ్వనుల మధ్య రథోత్సవం

జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి 39వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతరలో భాగంగా ఆదివారం మూడో రోజు రథోత్సవం జరిగింది. ఉదయం భక్తులు నరనారాయణ స్వామి, ఆంజనేయస్వామి దేవతా మూర్తులకు అభిషేకం పూజలు జరిపారు. అనంతరం సాయంకాలం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను, రథాన్ని అలంకరించి, ఆలయ పరిసరాల్లో రథాన్ని తింపారు. భక్తుల జయజయ ధ్వనుల మధ్య, నమోనారాయణ నామస్మరణతో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. పూజారులు కాకర నర్సయ్య, రాజనరేంద్రశర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, సభ్యులు కిషన్‌గౌడ్, అంజగౌడ్, శంకరయ్య, విష్ణుమూర్తి, బొంతల మల్లేశ్, గట్టు మల్లేశ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కత్తెరసాలలో బోనాలు



బోనాలు పోస్తున్న భక్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో బోనాలు పోసి తీపి పదార్థాలను స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

రేపు బహిరంగ వేలం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతరలో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రవి తెలిపారు. ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పులిహోర, లడ్డూ ప్రసాదం, నూనె అమ్మకం, బోనములు చెల్లించుటకు వేలం నిర్వహించనున్నట్లు, ఆసక్తి ఉన్న వారు రూ.10వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చరా?



భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిలోని భీమారం అటవీప్రాంతంలో బీటీరోడ్డుపై గుంతలు పడ్డప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ద్విచక్రవాహన చోధకులు నానా కష్టాలు పడుతున్నారు. వర్షాకాలం అనంతరం ప్రతి సంవత్సరం మరమ్మతు చేపట్టే జాతీయ రహదారుల శాఖ ఈ సారి మరిచిపోయారు. దీంతో భీమారం బస్టాండ్ నుంచి చెన్నూర్ వైపు దాదాపు 4కిలోమీటర్ల దూరం రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ గుంతలు కనపడటంలేదు. దీంతో ఆ గుంతలో పడిపోతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయంలో సంబంధిత అధికారుల దృష్టికి అనేక సార్లు తీసికెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే జాతీయరహదారి గుంతల మయం అయినా నిర్లక్ష్యం చూపడంపై అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. నేషనల్ హైవేస్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని జాతీయరహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బందుల లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సరుకులు అందజేత

జన్నారం: అనారోగ్యంతో మృతి చెందిన దేవునిగూడ గ్రామానికి చెందిన వెంకటేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వీబీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వీబీపీ ఆధ్వర్యంలో వెంకటేశ్ కుటుంబ సభ్యులకు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు.